క్లుప్తంగా

ఎరువులు మంజూరు

శిరివెళ్ల: మండలంకు రబీ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు మంజూరయ్యాయని ఏఓ సుధాకర్ సోమవారం తెలిపారు. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె భరోసా కేంద్రాలకు 31 టన్నులు, యూరియా 41 టన్నుల మంజూరయ్యిందని చెప్పారు. రూ. 1350లకు డీఏపీ, రూ. 266 యూరియా లభిస్తుందన్నారు.

కేడీసీసీ బ్రాంచి చీఫ్ మేనేజర్‌గా మహబూబ్‌బాషా



శిరివెళ్ల: కేడీసీసీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్‌గా షేక్ మహబూబ్ బాషా నియమితులయ్యారు. గతంలో ఉన్న మేనేజర్ అమరనాథరెడ్డి కర్నూలు జిల్లా కృష్ణానగర్ బ్రాంచ్‌కి బదిలీకాగా షేక్ మహబూబ్‌బాషా ఆదోని నుంచి ఇక్కడికి వచ్చారు. ఏడాదికి రూ. కోటి టర్నోవర్ బ్రాంచ్‌లకు చీఫ్ మేనేజర్లను హెడ్ ఆఫీస్ నియమించింది.

ఐక్యమత్యంతోనే వడ్డెరుల అభివృద్ధి

నంద్యాల(అర్బన్): ఐక్యమత్యంతోనే వడ్డెరులు అభివృద్ధి సాధ్యమని ఏపీ వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేష్ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదరికంలో మగ్గుతున్న వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర పిల్లలకు వసతి గృహాల్లో ప్రవేశం, విద్యా, వైద్య రంగాలతో పాటు ప్రత్యేకంగా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివభాస్కర్, రాజు, మద్దిలేటి పాల్గొన్నారు.

ధర్మ దీక్షను విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): కర్నూలులో కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఈనెల 18న చేపట్టనున్న రాయలసీమ ధర్మ దీక్షకు ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులో కృష్ణానది యాజమాన్య బోర్డు సాధనకు ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యాలతో సీమ ప్రాంతానికి నీటి వాటాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీన్ని నివారించేందుకు కర్నూలులో కేఆర్ఎంబీని ఏర్పాటు చేయాలన్నారు. పట్టిసీమ నిర్మాణంతో కృష్ణా డెల్టాకు శ్రీశైలం ప్రాజెక్టుతో అనుబంధం తెగిపోయిందన్నారు. నాగార్జున సాగర్‌కు ఇస్తున్న నీటిని మాత్రమే విద్యుత్ శక్తికి వినియోగించుకోవాలని బచావత్ ట్రిబ్యునల్ పేర్కొందని గుర్తు చేశారు.

వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన వీఆర్ఏ వెంకటపతి(63)సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్ఐ నాగేంద్రుడు, జూనియర్ అసిస్టెంట్ రామరంజిత్ కుమార్, వీఆర్వో మల్లేశ్వరప్పమృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.15వేలను మృతుడి భార్య దానమ్మకు అందజేశారు. అలాగే వీఆర్ఏల సంఘం తరపున రూ.5వేల నగదును నాయకులు శ్రీనివాసులు, బాషాఅందజేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శిరివెళ్ల: మండల పరిధిలోని గోవిందపల్లెలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో గడ్డం భాస్కర్ (40) మృతి చెందాడు. దీంతో పండగపూట ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడు గ్రామంలో చిన్న చిన్న కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఎక్కి బల్బుకు కనెక్షన్ ఇచ్చే ప్రయత్నంలో షాక్ కొట్టి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారత సైన్యం పరాక్రమం ఎనలేనిది



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ మునిశేఖర్

నంద్యాల(అర్బన్): దేశ రక్షణలో భారత సైన్యం పరాక్రమం ఎనలేనిదని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునిశేఖర్ తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం ఆర్మీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు పేరెడ్ నిర్వహించి మార్చ్‌ఫాస్ట్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మునిశేఖర్ మాట్లాడుతూ దేశం కోసం ఎంతో మంది జవాన్లు అమరులయ్యారన్నారు. సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశ సేవలో యువత తరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీటీఓ పెద్దస్వామి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో యాభై ఏళ్ల తర్వాత సంజీవనగర్ రామాలయం, శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని రథంపై ఆశీనులు గావించి ఉదయం 8.30గంటలకు దేవాలయ ఆవరణం నుంచి బయల్దేరింది. ఈ రథోత్సవంతో పట్టణంలో రోడ్లన్ని గోవింద నామంతో మారుమోగాయి. చెక్కభజనలు, కోలాటాలు, శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి వేషదారణలు కీలు గుర్రాలు, పొడుగు కాళ్ల మనుషులు నృత్యాలు, మహిళల అన్నమయ్య కీర్తనల మధ్య రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సంజీవనగర్ శ్రీనివాస నగర్, నాగులకుంట రోడ్డు, గాంధీచౌక్, ఇదే మార్గం గుండా దేవాలయానికి చేరుకున్నారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాస్, మధుసూదన్, సుబ్రమణ్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి గ్రామోత్సవంలో నృత్యాలు చేస్తున్న దృశ్యం



కనుల పండువగా స్వామివారి తెప్పోత్సవం

నంద్యాల(వ్యవసాయం): మకర సంక్రాంతి రోజున సంధ్యవేళ శ్రీదేవి, భూదేవిలతో కలిసి వేంకటేశ్వర స్వామి తెప్పలో విహరించారు. ఈ కమనీయ దృశ్యాన్ని భక్తులు తిలకించి పులకరించారు. స్థానిక చిన్నచెరువు కట్టపై ఉన్న వినాయక ఘాట్ వద్ద శ్రీవారి తెప్పోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. కోలాటాలు, చెక్క భజనలు, భక్తాంజనేయ భజనబృందం భజనలు, డప్పుల వాయిద్యాలు, దర్మకర్తల నృత్యాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. శోభాయాత్ర శ్రీనివాస జంక్షన్, ఎన్‌కేరోడ్, వివేకానందసెంటర్, గాంధీచౌక్, పార్కురోడ్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా చిన్న చెరువును చేరింది. భక్తులు రోడ్లకు ఇరువైపులా నిలబడి స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. సాయంత్రం శోభాయాత్ర వినాయక ఘాట్‌కు చేరుకుంది. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తెప్పలో ప్రతిష్టించారు. తర్వాత పూజలు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. ఈ తెప్పోత్సవం వేదమంత్రోచ్చరణలతో మొదటి విహారంతో ప్రారంభం కాగా రెండో విహారం నాదం భజంత్రీలతో రెండవ విహారం నిర్వహించి మూడో విహారం గానంతో మూడుసార్లు చిన్నచెరువులో విహరించారు. మొత్తం తొమ్మిసార్లు విహరించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి గుమ్మడికాయలతో స్వామి, అమ్మవార్లకు దిష్టిని తీశారు. ఈ సందర్భంగా భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవి కల్యాణం అనంతరం లోకకల్యాణం కోసం నిర్వహించామన్నారు.



చిన్న చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నమో నారసింహ

- భక్తి శ్రద్ధలతో నృసింహస్వామి దీక్ష
- 2 వేల మందికి పైగా దీక్ష చేపట్టిన భక్తులు
- సుదర్శహోమం నిర్వహించి దీక్షా మాలలు అందజేసిన అర్చకులు

ఆళ్లగడ్డ: శ్రీమద్ అహోబిలం శ్రీ లక్ష్మీనారసింహస్వామి దీక్షను భక్తులు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. పారువేట ఉత్సవాల్లో భాగంగా స్వామి గ్రామాల్లో పర్యటించేందుకు బయలుదేరే రోజున దీక్షను ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం రాత్రికే వివిధ ప్రాంతాల నుంచి అహోబిలం చేరుకున్న భక్తులు సోమవారం తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి, పసుపు దుస్తులు దరించి దిగువ అహోబిలంలో వెలసిన మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ఎదురుగా యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీసుదర్శన హోమం నిర్వహించారు. తదనంతరం అర్చకులు దీక్షా పరులకు శ్రీ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దీక్ష మాలలను వేసి ఆశీర్వదించారు. దీక్షాపరులు నేటి నుంచి 41 రోజులు నారసింహ స్వామి దీక్ష కొనసాగిస్తారు.

ఆకట్టుకున్న ముగ్గులు

దొర్నిపాడు: సంక్రాంతి పండుగ వచ్చిందంటే సరి గుర్తొచ్చేది ముగ్గులు. ఏ ఇంటి ముంగిట చూసిన సింగారంగా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రామచంద్రపురం గ్రామంలో వేసిన ఓ ముగ్గ వద్ద ఆడపడుచులు సోమవారం ఇలా ఎంతో సంబరంగా ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందం వ్యక్తం చేశారు.



ఆశీర్వచనాలు అందుకుంటున్న ఎమ్మెల్యే

పార్వేట ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. దిగువ అహోబిలం దేవాలయం చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్వేట పూజలు అనంతరం స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం ఎమ్మెల్యే స్వామి ఉత్సవ పల్లకిని దేవాలయం బయటివరకు భుజంపై మోసుకొచ్చి పర్వేట పల్లకీని సాగనంపి ఉత్సవాలను ప్రారంభించారు. ఈయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, అమర్‌నాథరెడ్డి, అహోబిలం సర్పంచ్ నాసారి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

దొర్నిపాడు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం మహిళకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది మహిళలు పోటీల్లో పాల్గొనడంతో కాలనీఅంతా సందడిగా మారింది.

బహుమతుల ప్రదానం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రామచంద్రాపురంలో ముగ్గులు, టగ్ఆఫ్ వార్, కబడ్డీ పోటీలను కంట్రాక్టర్ పువ్వాడ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గెలిపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు.

కోనసీమను తలపించిన సంక్రాంతి సంబరాలు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో కోనసీమను తలపించేలా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఇళ్ల ముంగిట రంగవల్లులు.. కొత్త కోడళ్లు, అల్లుళ్లతో లోగిళ్లు కళకళలాడాయి. ఊరంతా ఒక్కటై సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కుంటలో నిర్వహించిన తెప్పోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులంతా వీక్షించి తన్మయత్వం చెందారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ బబ్బూరి ఉమాదేవి, ఉప సర్పంచ్ బబ్బూరి శిరీష, నాయకులు వెంకటస్వామి, మూల్పూరి దయానందరావు, బబ్బూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని సాంబవరం గ్రామంలో ఆదివారం మాధవ స్వామి, యాళ్లూరులో సోమవారం ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీ మాధవ స్వామి, ఎం.చింతకుంట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి, ఎం.కృష్ణాపురం గ్రామంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, అలాగే గోస్పాడులో శివుడు, పార్వతి, గంగా, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల, సీతారామ ఆంజనేయస్వాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు కాయ కర్పూరం, నైవేద్యాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం పారువేట నిర్వహించి యువకులకు పరుగు పోటీలు నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువకులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. కనుమ పండుగ పురస్కరించుకుని ఉయ్యాలవాడలో పారువేట ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. పోటీల్లో విజేతగా నిలిచిన చాకలి సురేష్‌కు ప్రోత్సాహక బహుమతి ప్రదానం చేశారు. సీతారాములు, శివపార్వతులు, కోదండ రామ ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు పోచా రాధాకృష్ణారెడ్డి, ఖాతా దస్తగిరిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం రుద్రవరంలో భాస్కర నందీశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి వారికి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు స్వామి వారిని పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవంగా వెళుతుండగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పార్వేట ఉత్సవంలో భాగంగా స్వామి వార్ల పల్లకీ గ్రామ శివారులోకి చేరుకోగా అక్కడ ఆలయ నిర్వాహకులు యువకులకు పరుగు పందెం నిర్వహించారు. విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు.



రామచంద్రాపురంలో సీతారాముల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



యాళ్లూరులో శ్రీ ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీ మాధవ స్వామి ఊరేగింపు దృశ్యం



ఉయ్యాలవాడలో పారువేటకు తరలివెళ్తున్న ఉత్సవమూర్తులు



రుద్రవరంలో పరుగు పందెంలో పోటీపడుతున్న యువకులు

దొరపల్లె వంతెన ప్రమాద మృతులకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(అర్బన్): డోన్ మండలం దొరపల్లి వంతెన నేషనల్ హైవే 44 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్లాకృష్ణా, రామకృష్ణ, చాకలి నందీష్‌లకు నేషనల్ హైవే అధికారులు ఒక్కొక్కరికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు ముఖ్యనాయకులతో కలిసి మాట్లాడారు. నేషనల్ హైవే నుంచి దొరపల్లె గ్రామానికి సర్వీసు రోడ్డు లేకపోవడంతోనే వీరు మృతి చెందారన్నారు. నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యాలతోనే రోడ్డు ప్రమాదం జరిగిందని, బాధ్యతగా బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ కౌన్సిలర్ సుంకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

నంద్యాల(అర్బన్): విప్లవ విద్యార్థి ఉద్యమ కారుడు కామ్రెడ్ జార్జిరెడ్డి ఆశయ సాధనకు ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి 76వ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యాలయంలో జార్జిరెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థి మేధో వర్గాన్ని తయారు చేశారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై సైద్ధాంతికంగా పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి నవీన్‌బాబు, నాయకులు వెంకటేష్, అజీద్, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో గుప్తనిధుల వేట

ఆళ్లగడ్డ: చాగలమర్రిలోని బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు గుప్త నిధుల కోసం సోమవారం యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆలయంలోని ప్రధాన శివలింగం ఎదురుగా ఉన్న నంది విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గుప్తనిధుల అన్వేషణలో భాగంగానే చేసింటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈమేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి

గోస్పాడు: ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ కోరారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గోస్పాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అందజేస్తున్న ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సిమెంటు, స్టీలు, ఇసుక, ఇటుకలతో పాటు కూలీల ధరలు అమాంతంగా పెరిగాయని, రూ.1.80 లక్షలు కాకుండా రూ.5.లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బరాయుడు, జిలానీ బాషా, హరి నాథ్, గోకారి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో ఘర్షణ

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం దళిత కాలనీలో దారికి అడ్డంగా ఉన్న కారును పక్కకు తీయమన్న విషయంపై ఘర్షణ జరిగి మణి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మణి తన స్నేహితుడు చైతన్యతో కలిసి మోటార్ సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగాకాలనీలో సీసీ రోడ్డుపై ఓ కారు అడ్డంగా ఉండడంతో పక్కకు తీయించాలని కారు యజమాని బ్రహ్మంకు సూచించారు. ఈ విషయంపై వారి మధ్య మాటామాట పెరిగి జరిగిన ఘర్షణలో మణికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న అతడి తల్లి ఘటనాస్థలానికి చేరుకొని రక్త గాయాలతో పడి ఉన్న కుమారుడిని చూసి తల్లడిల్లింది. వెంటనే ఆమె క్షత గాత్రున్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్సల అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘర్షణపై క్షత గాత్రుడి తల్లి జయమ్మ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. బ్రహ్మంతో పాటు శ్రీహరి, శంకర్, లక్ష్మీ చెన్నయ్య పాత కక్షలు మనసులో పెట్టుకొని తన కుమారుడిపై దాడి చేసి గాయపరచారన్న ఆమె ఫిర్యాదుపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

యాత్రలు చేయవద్దని ఆంక్షలు లేవు

- మంత్రి కొట్టు సత్యనారాయణ
- రాష్ట్రంలో ఎవరికి, ఏ పార్టీకీ లేవు
- చంద్రబాబుతో పవన్ పొత్తు పెట్టుకోనిది ఎప్పుడు ?

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీఓ నం.1 రాష్ట్ర ప్రజల సౌలభ్యం కోసమేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం మల్లన్న దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో యాత్రలు చేయవద్దని ఎవరికీ అంక్షలు పెట్టలేదని, ప్రతిపక్షంతో పాటు అధికార పక్షం కూడా ఎవైనా యాత్రలు, బహిరంగ సభలు, పాదయాత్రలు చేయాలంటే తప్పకుండా పోలీసు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఇది టీడీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ, జనసేన, అధికార పార్టీకి కూడా వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు దురదుష్టకరమైన సంఘటనలు జరిగాయని, అన్ని సంఘటనలు జరిగాక ప్రభుత్వం పట్టించుకోకపోవడం కరెక్టు కాదన్నారు. మా ప్రభుత్వం కూడా సభలు, సమావేశాలు పెట్టలన్నా అనుమతి తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. పవన్, చంద్రబాబు 2014 నుంచి కలిసే ఉన్నారన్నారు. వారి పొత్తు లేనిది ప్పుడు అని ప్రశ్నించారు?. 2014 నుంచి ఐదేళ్లలో ఎంతో అవినీతి జరిగితే ప్రశ్నించలేదని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అనుకుంటే.. దానికి విరుద్ధంగా ఆయన చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఎవరి మద్దతు లేకుండా మేము ఎన్నికల్లో పాల్గొంటామని మంత్రి తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

నంద్యాల(సిటీ): పట్టణంలో జరిగిన 13వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు సోమవారం ముగిశాయి. ఎస్పీజీ కళాశాల మైదానంలో గత మూడు రోజుల పాటు పోటీలు హోరాహోరీగా సాగగా ఫైనల్‌లో అనకాపల్లి, తిరుపతి జట్లు తలపడ్డాయి. అనకాపల్లి జట్టు తిరుపతి జట్టుపై 1–0గోల్‌తో విజయం సాధించి విజేతగా నిలిచింది. అదేవిధంగా తిరుపతి జట్టు రన్నర్‌గా నిలువగా మూడు, నాలుగు స్థానాల్లో సత్యసాయి, కడప జట్లు నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీజీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ జీవలత హాకీ నంద్యాల అధ్యక్షుడు పాల్ రాజారావు, కార్యదర్శులు సుధీర్, వెంకటేశ్వర్లు, మాణిక్యరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకున్న అనకాపల్లి జట్టు